
భారీ వానొస్తే ఆగమే..!



2





2

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## 16 నుంచి బీఈడీ పరీక్షలు ప్రారంభం



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ పరీక్షలు 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని కంట్రోలర్ సంపత్ కుమార్ తెలిపారు. బీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్/ 1,2,3,4 సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ (2022 బ్యాచ్ నుండి) థియరీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ కోర్సుల వన్ టైమ్ ఛాన్స్ పరీక్షలు శనివారం ప్రారంభం అయ్యాయన్నారు.



## ఖరీఫ్ సాగుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలి




**అక్షరటుడే, ఇందూరు:** ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు తోడ్పాటు అందించేలా అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అధికారులతో కలిసి వీసీ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. వానాకాలం 2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు రైతులతో మమేకమవ్వాలన్నారు. రాష్ట్రంలో 138.49 లక్షల ఎకరాలలో సాగు లక్ష్యం నిర్దేశించామని, 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని 68 మందిని అరెస్టు చేసి, 34 క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని, అర్హత కలిగిన ప్రతి రైతు నమోదు చేసుకునేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు.



## పైడి రాకేష్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాకేష్ రెడ్డి దేశంలో అనుమతితో ఎర్రచందనం వ్యాపారం చేస్తున్నారని, దానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. రాకేష్ రెడ్డిని ఎర్రచందనం స్మగ్లర్ అంటూ కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేస్తారని దమ్ముంటే టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి ఆర్మూర్‌లో పోటీకి నిలవాలన్నారు. బీజేపీ కార్యకర్తలు మాట అంటే పడరన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సైతం తన నోరు అదుపులో పెట్టుకోవాలని పేర్కొన్నారు. మరోసారి ఎంపీ అర్వింద్‌పై, ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఆర్మూర్‌లో తిరగనివ్వబోమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ బీసీ సెల్ అధ్యక్షుడు యామాద్రి భాస్కర్, కిషన్ మోర్చా నాయకుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు పోల్కం వేణు, అనిల్ కుమార్, యుగంధర్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల నిర్వహణలో పారదర్శకత తేవడం, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే కు శ్రీకారం చుట్టింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొదటి విడతలో 70 గ్రామాల చొప్పున.. మొత్తం 140 ఎంపిక చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇది వరకే సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. - అక్షరటుడే, డిచ్‌పల్లి



# వివాదాల్లేని భూములే లక్ష్యం!

- రీ సర్వే చేపడుతున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 140 గ్రామాల ఎంపిక

చాలా గ్రామాల్లో పాత సర్వే రికార్డులు, మారిన భౌగోళిక పరిస్థితులు, తప్పుల తడకలతో నమోదైన భూమి వివరాలు, ఆక్రమణలు, హద్దుల వివాదాలు రైతులను ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టే రీసర్వే రైతులకు కొత్త భరోసా కల్పిస్తుందనే ఆశాభావం నెలకొంది.

### రీసర్వే ఎందుకు?

ప్రస్తుతం రాష్ట్రంలో 90 ఏళ్ల క్రితం నిజాం కాలంలో జరిగిన భూముల సర్వే ఆధారం చేసుకుని రికార్డుల నిర్వహణ కొనసాగుతోంది. కాలక్రమేనా కాలువలు, రహదారులు, చెరువులు, గ్రామ విస్తరణ, సాగు విధానాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. వారసత్వ విభజనలు, భూముల క్రయవిక్రయాల కారణంగా సర్వే నంబర్లకు అనుబంధంగా బై నంబర్లు ఏర్పాటయ్యాయి. దీంతో రైతులతో పాటు రెవెన్యూ అధికారులకు సమస్యలు తలెత్తుతున్నాయి. రీసర్వే అనంతరం బైనంబర్లు ఉండవు. అక్షాంశాలు రేఖాంశాలు(కో ఆర్డినేట్స్)తో సర్వే నంబర్లను రూపొందించనున్నారు. తద్వారా జియోట్యాగింగ్ చేసుకునే వీలుంటుంది. దీంతో భవిష్యత్తులో హద్దుల సమస్యలుండవు.

### ఇలా చేస్తారు

అత్యాధునిక జీపీఎస్, డ్రోన్, టోటల్ స్టేషన్ పరికరాలతో భూముల రీ సర్వే నిర్వహిస్తారు. ప్రతి సర్వే నంబర్‌ను ఖచ్చితంగా గుర్తించి, భూమి యజమానుల సమక్షంలో హద్దుల నిర్ణయిస్తారు. పాత రికార్డులతో పోల్చి వ్యత్యాసాలు పరిశీలిస్తారు. అభ్యంతరాలకు అవకాశం ఇచ్చి, తుది మ్యాప్‌లు, రికార్డుల తయారు చేస్తారు. దీంతో రైతులకు హద్దు సమస్యలు తప్పనున్నాయి. పహాణీ, మ్యాప్, భూమి విస్తీర్ణం ఒకే విధంగా నమోదు కావడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తగ్గుతాయి.

### రైతులు జాగ్రత్త పడాలి

భూమికి సంబంధించిన అన్ని పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి. సర్వే సమయంలో తప్పనిసరిగా భూమి వద్ద ఉండాలి. హద్దులను స్పష్టంగా చూపించాలి. అభ్యంతరాలుంటే వెంటనే అధికారులకు తెలియజేయాలి. తుది రికార్డులను పరిశీలించి తప్పులుంటే సవరణ కోరాలి. సర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల వారీగా విస్తీర్ణాలను సరిచేసే నిమిత్తం రైతులకు సెక్షన్9(2) కింద నోటీసులు జారీ చేస్తారు. అందుకు రైతులు దస్త్రాలను సమర్పించాలి. రెవెన్యూ రికార్డుల్లోని వివరాలతో సరిపోలితే కమతాల వారీగా ఎల్పీఎం (ల్యాండ్ పార్సల్ మ్యాప్)లు రూపొందిస్తారు. కమతాల వారీగా హద్దులు నిర్ణయిస్తారు. రెండు సర్వే నంబర్ల మధ్య హద్దుల సమస్యలుంటే పరిష్కరిస్తారు. ఒకే సర్వే నంబర్‌లోని భూముల మధ్య తగాదాలను రైతులే పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.



## ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లపై మున్సిపల్ అధికారుల దాడులు..

**అక్షరటుడే: బోధన్ :** పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. శుభ్రత పాటించని హోటళ్లకు జరిమానాలు విధించారు. బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని హోటళ్లు, బేకరీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని గాయత్రి టిఫిన్ సెంటర్, అరోమా హోటల్, గణేష్ ఇడ్లీ సెంటర్, ఏషియన్ బేకరీలకు రూ.500 చొప్పున బావర్చి హోటల్‌కు రూ.1000 జరిమానా విధించారు. పరిశుభ్రత పాటించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు గణేష్, దత్తారావు తదితరులు పాల్గొన్నారు.



## కూలుతున్న వంతెనను పరిశీలించిన అధికారులు..

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని తిమ్మాపూర్ శివారులో ఉన్న వంతెన ధ్వంసమై పూర్తిగా కూలిపోయే స్థితికి చేరింది. శనివారం ఉదయం సమయంలో వంతెన ఓవైపు కూలిపోగా వాహనదారులు ఈ మార్గంలో వెళ్లేందుకు భయపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆర్అండ్‌బీ డీఈ నారాయణను వంతెన పరిశీలించాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వంతెన సందర్శించిన డీఈ ప్రస్తుతం మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణ కోసం కృషి చేయాలి : డీఐజీ భాస్కరన్




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నేరాల నియంత్రణ కోసం కృషి చేయాలని.. నిఘా వ్యవస్థను పటిష్టపర్చాలని బాసర జోన్-2 డీఐజీ భాస్కరన్ అన్నారు. నగరంలోని సీపీ కార్యాలయంలో నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాస్థాయి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పర్యవేక్షణ, శాంతిభద్రతలకు భంగం కలిగించే అంశాలపై ప్రత్యేకంగా డీజీపీ చర్చించారు. ప్రజల ఫిర్యాదులను సకాలంలో స్వీకరించి, పారదర్శకంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి సైబర్ నేరాలను అరికట్టాలని, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువతలో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ సాయి చైతన్య, నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల, ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, జగిత్యాల్ ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీలు, ఏసీపీలు, సీఐలు, రిజర్వ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో ప్రజలే మా బలం: ఎస్పీ




**అక్షరటుడే, కామారెడ్డి :** పోలీసు - ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలే నేరాల నివారణకు కీలకమని, ప్రజలే తమకు ప్రధాన బలమని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంతంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5 నుంచి 8.30 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో 160 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల ఛేదనకు ప్రజలు ఇచ్చే సమాచారమే అతి పెద్ద ఆయుధమన్నారు. ఇటీవల ఛేదించిన పలు దొంగతన కేసుల్లో పంచర్ షాపు కార్మికుడు, విలేకరి ఇచ్చిన సమాచారం కీలకంగా మారిందని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనాలు, గంజాయి లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా 121 ద్విచక్ర వాహనాలు, 36 ఆటోలు, 2 కార్లు పరిశీలించారు. వీటిలో 11 వాహనాలు నంబర్ ప్లేట్లు లేకుండా సంచరిస్తున్నట్లు గుర్తించారు. 18 బీర్ బాటిళ్లు, 12 మద్యం బాటిళ్లు, ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. డీఎస్పీ మధుసూదన్, టౌన్ సీఐ నరహరి, రూరల్ సీఐ శ్రీధర్, భిక్కనూరు సీఐ నరేష్, ఆర్ఐలు సంతోష్, నవీన్, కృష్ణ పాల్గొన్నారు.

## మ్యూజియంను త్వరలోనే అభివృద్ధి చేసి ప్రారంభిస్తాం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని తిలక్‌గార్డెన్‌లోని మ్యూజియంను అభివృద్ధి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తామని పురావస్తు పరిశోధన శాఖ రాష్ట్ర సంచాలకులు అర్జున్ రావు అన్నారు. శనివారం ఆయన నగరానికి విచ్చేసి మ్యూజియంను సందర్శించారు. జిల్లా పర్యటనకు వచ్చిన సంచాలకులు అర్జున్‌రావును ఇతిహాస సంకలన సమితి ప్రతినిధులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. విశేష చారిత్రక నేపథ్యం కలిగిన జిల్లా ఇందూరు అన్నారు. ఇతిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, కార్యదర్శి మర్రిపల్లి భూపతి, దావుల వివేకానంద పాల్గొన్నారు.



## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి సీతక్క



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అన్నారు. ఇందల్వాయి మండలం వెంగల్ పాడ్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రాంపూర్ తండా నుండి వెంగల్‌పాడ్ తండా వరకు రూ.5.48కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, అలాగే కేకే తండా నుండి మెగ్యానాయక్ తండా వరకు రూ. 2.94 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం తిర్మన్‌పల్లిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో అదనపు సదుపాయాల కల్పనలో భాగంగా నూతనంగా నిర్మించిన వసతి గృహ భవన సముదాయం, కిచెన్ డైనింగ్ హాల్‌లను లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మారుమూల గిరిజన తండాలు, గ్రామాలలో అభివృద్ధి పనుల్లో పాల్గొనడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. పిల్లలు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ఆశయమన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా రూరల్ నియోజకవర్గంలో గిరిజన తండాలు, ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. కాగా, ఏకధాటిగా వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా స్థానిక ప్రజలు, గిరిజనులు మంత్రికి ఘన స్వాగతం పలికి, ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాల విద్యార్థినులతో కలిసి మంత్రి సీతక్క సంప్రదాయ గిరిజన నృత్యం చేశారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగ రావు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, తిర్మన్ పల్లి సర్పంచ్ చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
శనివారం
4.7.2026

www.aksharatoday.in

AKSHARA TODAY



## ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మండలం నర్సాపూర్ గేట్ వద్ద కల్లు దుకాణంలో ఓ వ్యక్తి కల్లు తాగి మృతి చెందగా.. మరొకరు తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన నియోజకవర్గంలో కలకలరం రేపింది. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి కుటుంబీకులు శనివారం బోధన్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ కల్లు తాగడం వల్లే మృతి చెందాడని.. మృతి చెందిన వ్యక్తి సంబంధీకులు కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఘటనపై సమగ్ర విచారణ చేపడతామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రావు తెలిపారు.




## కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు మంజూరు చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.5 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థి సేన ఆధ్వర్యంలో శనివారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఈ తీర్మానం చేశారు. సుమారు 900 మంది విద్యార్థులు చదువుతున్న కళాశాలలో కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా తరగతి గదులు, బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకోవాల్సి వస్తోందని తెలిపారు. అధ్యాపకుల కొరత, తాగునీటి సౌకర్యం లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రత్యేక చొరవ తీసుకుని కళాశాల సమగ్ర అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో శ్రీకాంత్, చందు, పాషా, ప్రవీణ్, నోమన్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



# భారీ వానొస్తే ఆగమే..!



■ దెబ్బతిన్న వంతెనలకు మరమ్మతులు కరువు ■ ఆందోళన చెందుతున్న ప్రజలు ■ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతుల చేయాలని విన్నపాలు

**గతేడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాలో అనేక రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఏడాది అవుతున్నా ఇప్పటికీ వాటి పునర్నిర్మాణ పనులు పూర్తి కాలేదు. దీంతో వర్షా కాలం రాగానే మళ్లీ ఆ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.**

**- అక్షరటుడే, ఎల్లారెడ్డి**

గతేడాది కురిసిన భారీ వర్షాలకు కూలిన వంతెనల వద్ద మట్టిని పోసి రోలింగ్ చేశారు. తాత్కాలిక పనులతో సరిపెట్టారు. పోసిన మట్టి భారీ వర్షాలు పడితే మళ్లీ కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది అవుతున్నా.. రోడ్డు పనులు ప్రారంభించకపోవడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు పాలకులు స్పందించి వర్షాలకు రోడ్లు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే మళ్లీ జిల్లా కేంద్రాలకు, రాజధానికి రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాలో పరిస్థితి ఇది..

కామారెడ్డి జిల్లా లో గతేడాది భారీ వర్షాలకు పోచారం గ్రామ సమీపంలోని ఎల్లారెడ్డి - మెదక్ రోడ్డు వంతెన కొట్టుకుపోయింది. అక్కడ తాత్కాలికంగా మళ్లీ మట్టి పోసి రాకపోకలను పునరుద్ధరించారు. శాశ్వత మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో మళ్లీ భారీ వర్షాలు పడితే మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాలకు వెళ్లే దారి ఇదే కావడం గమనార్హం. ఎల్లారెడ్డి -కామారెడ్డి రహదారిపై వడ్డెర కాలనీ, అడవి లింగాల, కొట్టాల గ్రామాల వద్ద వంతెలనపై నుండి వర్షం నీరు ఉధృతిగా ప్రవహించడం వల్ల రోడ్లు కొట్టుకుపోయాయి. ఆయా గ్రామాలకు 15 రోజులపాటు రాకపోకలు స్తంభించాయి. అప్పుడు తాత్కాలికంగా మట్టితో మళ్లీ రోడ్డును పూడ్చారు.

### ఎక్కడా శాశ్వత మరమ్మతులు లేవు..

ఎక్కడ కూడా శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంతో మళ్లీ ఆ ప్రాంతాల్లో మట్టి కుంగిపోయి రోడ్డు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో భారీవర్షాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాకపోకలు కొనసాగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లింగంపల్లి వంతెన సైతం భారీవరదకు కుంగిపోయింది. కామారెడ్డికి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ తాత్కాలిక రోడ్డును వేసి రాకపోకలను పునరుద్ధరించారు. ప్రస్తుతం మళ్లీ భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

### సీఎం స్వయంగా పరిశీలించినా..

ఈ వంతెనను సీఎం స్వయంగా వచ్చి పరిశీలించి వెళ్లారు. ఏడాది గడిచినా పనులు ప్రారంభం పూర్తి చేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కామారెడ్డి పట్టణ కేంద్రంలో సైతం భారీ వరదలకు చాలా చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. వాటికి సైతం మరమ్మతులు చేయడంలో అధికారులు మొద్దు నిద్ర వహిస్తున్నారు.

మళ్లీ విపత్తు రాకముందే అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత పనులు జరిగేలా చూడాల్సి ఉంది. అయితే అధికారులు మాత్రం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పేర్కొంటున్నారు.

## 6న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో స్పాట్ అడ్మిషన్లు..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)ఆధ్వర్యంలో 2026-27కు గాను ఇంటర్ ఫస్టియర్ స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి తెలిపారు. ఆర్‌జేసీసీఈటీ ద్వారా ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు రెండు దశల్లో పూర్తి చేశాయని.. మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత జిల్లా కేంద్రంలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరై ప్రవేశ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. 6వ తేదీ ఉదయం టీజీఎస్‌డబ్ల్యూఆర్‌లలో సంప్రదించాలని కోరారు.



## ఉర్సుకు ఉత్సవాల కమిటీ ఏర్పాటు

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని సూఫీ సంత్ హజ్రత్ సయ్యద్ షా జలాల్ బుఖారీ (రహ్మతుల్లాహి అలైహి) వార్షిక ఉర్సుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. 2026 ఉర్సు కమిటీని అధికారికంగా ప్రకటించారు. కమిటీకి ప్యాట్రన్‌గా మిర్జా కుర్రం బేగ్, అధ్యక్షుడిగా మీర్ ఇలియాస్ అలీ, జనరల్ సెక్రటరీగా యూనుస్ పటేల్, ముక్రం అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, చీఫ్ వలంటీర్స్ భ్యులను కూడా నియమించారు. ఉర్సు ఉత్సవాలు జూలై 29న పర్చమ్ కుషాయతో ప్రారంభం కానున్నాయి. జూలై 30న సందల్ ముబారక్, జూలై 31న జష్న్ ఏచిరాగా, ఖవ్వాలి కార్యక్రమం ఆగస్టు 1న దర్గా షరీఫ్‌లో మహిఫిల్‌ఎసమా నిర్వహించనున్నారు. బోధన్‌తో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.


## బీసీల అభ్యున్నతే దొడ్డి కొమురయ్య ఆశయాలకు నిజమైన గౌరవం



**అక్షరటుడే, ఇందూరు:** బీసీల అభ్యున్నతే దొడ్డి కొమురయ్య ఆశయాలకు నిజమైన గౌరవమని తెలంగాణ బీసీ-ఎస్సీ-ఎస్టీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సాధికారత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో (IDOC)లో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సాయి కుమార్, నుడా ఛైర్మన్ కేశ వేణు, సీపీఐఎంఎల్ నేత ప్రభాకర్ , దేవారాం, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి భాగ్యలక్ష్మి, మయవర్ రాజేశ్వర్, మిరియాల సురేశ్ కుమార్, మేక సునంద, అర్సపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ స్థాయిలో విద్యా సౌకర్యాలు ఉన్నాయని.. విద్యార్థులు వీటిని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సోషల్ వెల్ఫేర్ అధికారి రాజగంగారాం తెలిపారు. శనివారం కోనాపూర్ ఉన్నత పాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో కంప్యూటర్ బోధన ప్రారంభమవుతుందని, విద్యార్థులను నమోదు చేసి సంఖ్య పెంచే విధంగా చూడాలని సూచించారు. కోనాపూర్ సర్పంచ్ అరుణ్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా జీపీ ఆధ్వర్యంలో చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరే విద్యార్థులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను సొంత ఖర్చులతో చెల్లిస్తానని తెలిపారు. కమ్మర్‌పల్లి మండల అభివృద్ధి అధికారి సదాశివ్, పంచాయతీ కార్యదర్శి నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## ఎల్లారెడ్డి నుంచి తిరుమలకు సైకిల్ యాత్ర విజయవంతం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సువర్ణ భూమి శబరిమల మహా పాదయాత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఎల్లారెడ్డి టు తిరుమల తిరుపతి మహా సైకిల్ యాత్ర విజయవంతమైందని యాత్రికులు పేర్కొన్నారు. పదిరోజుల ప్రయాణంలో భాగంగా శనివారం అలిపిరి చేరుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ గురుస్వామి, వసంత్ కుమార్ గురుస్వామి మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర పదిరోజుల పాటు సుదీర్ఘంగా సాగిందన్నారు. శనివారం శ్రీవారిని దర్శించుకున్నామన్నారు. యాత్రంలో భూపాల్, ప్రవీణ్, రవి, నెల్లి గోపాల్ తదితర భక్తులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఎస్సై యాసిర్ అరాఫత్ అన్నారు. 'మన కాలనీ మన భద్రత మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్మూర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. యువత మత్తు పదార్థాల దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి




**అక్షరటుడే, ఇందూరు:** ఆరోగ్యవంతులు నిరభ్యంతరంగా రక్తదానం చేయవచ్చని ఆర్పీ ఫౌండేషన్ అధ్యక్షుడు బొద్దుల రాజేంద్రప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రెడ్ క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ వైద్యుడు,ఆర్పీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. రక్తదానం మహాదానమని ఆరోగ్యవంతులందరూ మూడు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ, ఇందూర్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి.రాఘవేందర్, చింతల గంగాదాస్, కోశాధికారి అంకం రాజేందర్, ప్రోగ్రామ్ ఛైర్మన్ దాసరి రాఘువేందర్, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, లయన్స్ క్లబ్ పూర్వాధ్యక్షుడు ఇరుమల శివలింగం, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్, డాక్టర్ జమాల్పూర్ రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి జైపాల్ కాలె తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో మాజీ సీఎం రోశయ్య జయంతి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ సీఎం రోశయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోతి, అకౌంట్స్ ఆఫీసర్ స్వరూపరాణి ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ.. రోశయ్య సుదీర్ఘ రాజకీయ జీవితంలో వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవహారాలపై అపారమైన అనుభవం, పరిపాలనా దక్షత, నిరాడంబర జీవనశైలితో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆయన సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రీజినల్ కార్యాలయ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం జలాభిషేకం



**అక్షరటుడే, నిజాంసాగర్:** వర్షాలు పుష్కలంగా కురవాలని కోరుతూ నిజాంసాగర్ మండలంలోని నర్వ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జలాలతో స్వామికి అభిషేకం చేశారు. విస్తారంగా వర్షాలు కురువాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింలు, సాయాగౌడ్, పోచాగౌడ్, బాలరాజు, మల్లయ్య, రాజు, బాల సాయిలు, సంతు, రామా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.